నయా ఫాసిస్టు విధానాలపై పోరు

- బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే విద్యార్థి నేతలపై వేటా? : విపి సాను
- జనం కోసం ప్రాణమిచ్చేవాడే నిజమైన హీరో : మాదాల రవి
- ఖమ్మంలో ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభ
- వీధుల్లో కదం తొక్కిన విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నయా ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా భారత విద్యార్థి ఫెడరేషన్ అలుపెరుగని పోరాటం చేస్తున్నదని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను తెలిపారు. హిందూ.. హిందుస్తానీ.. అంటూ కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొస్తున్నదన్నారు. బిజెపికి, మోడీకి వ్యతిరేకంగా మాట్లాడిన విద్యార్థి నేతలను విద్యాలయాల నుంచి సస్పెన్షన్ చేస్తోందని తెలిపారు. వేలాది మంది కోసం పోరాడేవాడే నిజమైన హీరో అని సినీ నటులు, అభ్యుదయవాది డాక్టర్ మాదాల రవి అన్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం (సీతారాం ఏచూరి నగర్)లో మూడు రోజులపాటు కొనసాగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదవ మహాసభలు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షతన శుక్రవారం ప్రారంభమైంది. దీనికి ముందు కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో విపి సాను మాట్లాడారు. కాశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి భద్రతా వైఫల్యమే కారణమని అన్నారు. పార్లమెంట్ మొదలు పుల్వామా వరకు అనేక చోట్ల ఉగ్రదాడులు జరుగుతున్నాయని, ప్రధానిగా మోడీ, హోం మంత్రిగా అమిత్ షాకు కొనసాగే అర్హత లేదన్నారు. పెహల్‌గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చారంటే ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనన్నారు. నరేంద్రమోడీ, బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే.. యూనివర్సిటీ విద్యార్థి నేతలపై వేటు వేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ హెచ్‌సియూ భూముల కాజేస్తున్నారన్నారు. సమస్యలపై ప్రశ్నించినందుకు విద్యార్థి నేతలపై దేశద్రోహం కేసు నమోదు చేస్తున్నారని తెలిపారు. టిఐఎస్ఎస్ రీసెర్చ్ స్కాలర్ రాందాస్‌పై రెండేళ్ల వేటు వేసిన విషయాన్ని ప్రస్తావించారు. నయా ఉదారవాద విధానాలు పెట్రేగుతున్నాయని చెప్పారు. ఫాసిస్టు, మతోన్మాద విధానాలను రూపుమాపాలని కోరారు.

పోరాటాలకు ఏకైక మార్గం చైతన్యం: మాదాల రవి

పోరాటాలకు చైతన్యం ఏకైక మార్గమని సినీ నటులు, నిర్మాత డాక్టర్ మాదాల రవి అన్నారు. అభ్యుదయశక్తులు ఐక్యం కావాలని, వామపక్షాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పోరాటాల ఖిల్లా ఖమ్మం జిల్లాకు రెడ్ సెల్యూట్ అంటూ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. 'చదువు ఎందుకు? చదువు ఎందుకు?? చదువు ఎందుకురా..??? నలుగురిలో దీపమై నిలిచేందుకు రా..!' అంటూ ఉద్రూతలూగించారు. వేలాది మంది కోసం ప్రాణమిచ్చే వాడు నిజమైన హీరో అని, దాస్య శృంఖలాల నుంచి దేశానికి విముక్తి కల్పించిన భగత్ సింగ్, ప్రపంచ విప్లవాన్ని ముందుకు నడిపిన చేగువేరా.. బడుగు జీవుల కోసం పాటుపడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిజమైన హీరోలని వ్యాఖ్యానించారు. ఒక్క రూపాయి కూడా పంచకుండా ఎంపి, ఎమ్మెల్యేలు ఎప్పుడు ఎన్నికవుతారో ఆరోజే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లని తెలిపారు. కళ కళ కోసం కాదు.. కాసుల కోసం కాదు.. సమాజ చైతన్యం కోసమని 'ఎర్రమల్లెలు' పూయించిన మాదాల రంగారావు ప్రజానాట్యమండలి నుంచి వచ్చిన వారేనని చెప్పేందుకు గర్వపడుతున్నానని అన్నారు. ప్రజా కళాకారులు సమాజానికి పట్టిన జబ్బును వదలగొట్టాలని పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వంలో గరికపాటి రామ్మోహన్‌రావు నిర్మించిన పుట్టిల్లు సినిమా ఈ కోవలోనిదేనని చెప్పారు. భగత్ సింగ్ లాంటి మహోన్నత వ్యక్తులు ఇంట్లో పుట్టొద్దనే.. సమాజ ధోరణిలో ఎస్ఎఫ్ఐ మార్పు తీసుకురావాలన్నారు. శ్రమజీవుల రక్తం నుంచి ఎర్ర జెండా పుట్టిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని స్పష్టం చేశారు. ఏ వ్యవస్థ మారాలన్నా సాంస్కృతిక విప్లవం రావాలని పిలుపునిచ్చారు.

విద్యారంగంలోనే అభివృద్ధి : టి.నాగరాజు

విద్యారంగంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు అన్నారు. విశ్వవిద్యాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలన్నారు. నాలుగు వేల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానం అమలు కాకుండా అడ్డుకోవాలని తెలిపారు. కొత్త నిర్ణయాలతో పోరాటాలకు వెళ్లాలని ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ ఐవి రమణారావు, రిసెప్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు రవి మారుత్ సూచించారు. అధ్యయనం కొరవడితే తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతుందని హెచ్చరించారు. ఈ బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ్, విద్యావేత్తలు మువ్వా శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఎఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం పూజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం వీధుల్లో కదంతొక్కుతూ ర్యాలీ..

ఎస్ఎఫ్ఐ ఐదవ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఖమ్మం నగర వీధుల్లో విద్యార్థులు కదం తొక్కుతూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్‌పి సెంటర్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ వైరా రోడ్ మీదుగా మహాసభల ప్రాంగణం భక్త రామదాసు కళాక్షేత్రం వరకు సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. నినాదాలు చేస్తూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాలు, భగత్ సింగ్, చేగువేరా ప్లకార్డులు, కోలాటం, డప్పు నృత్యాలు, కోయ కళాకారుల రేల నృత్యాలతో ఆద్యంతం ఆకట్టుకునేలా ప్రదర్శన సాగింది. బహిరంగ సభ అనంతరం ఐద్వా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు భోజనాలు వడ్డించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి జెండా ఆవిష్కరించటంతో మహాసభలు ప్రారంభమయ్యాయి. మహాసభల్లో భాగంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

ఉగ్రవాదంపై పార్టీలకతీతంగా పోరాడుదాం

- ప్రధానికి అండగా నిలుద్దాం
- పహల్గాం ఉగ్రదాడి హేయమైనది : సిఎం రేవంత్
- హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీలు, సిద్ధాంతాలకతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్ ఇందిరా విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దీనిలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు, మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎంపి మల్లు రవి తదితరలు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరం ఐక్యమౌదాం..

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ఏకమై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయటం హేయమైన చర్య అని అన్నారు. "ఉగ్రవాదంపై పోరులో ప్రజలంతా ప్రధాని వెంట ఉంటారన్నారు. ఈ విషయంలో మోడీకి మద్దతు తెలుపుతున్నానని చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరముందని తెలిపారు. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ఆనాడు ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతతో పోల్చారన్నారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాల్సిదేనని చెప్పారు. పిఒకెను భారత్‌లో కలపాలన్నారు. ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకుని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగిందనీ, అందరం ఏకమై దాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. దాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సామ్రాజ్యవాదంపై పోరాడేది సోషలిస్టు దేశాలే

- చేగువేరా, క్యాస్ట్రో మాకు నిరంతరం స్ఫూర్తిదాయకం
- క్యూబా రాయబారి జుయెన్ కార్లోస్
- హైదరాబాద్‌లో క్యూబా సంఘీభావ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామ్రాజ్యవాదంపై పోరాడేది సోషలిస్టు దేశాలేనని భారత్‌లో క్యూబా రాయబారి జుయెన్ కార్లోస్ అన్నారు. అమెరికా అనేక రూపాల్లో ఆంక్షలు విధిస్తున్నా వాటిని తట్టుకుని నిలబడుతున్నామనీ, ముందుకెళ్తున్నామని చెప్పారు. క్యూబా ఒంటరి కాదనీ, ప్రపంచమంతా అండగా ఉందన్నారు. చేగువేరా, ఫైడల్ క్యాస్ట్రో తమకు నిరంతరం స్ఫూర్తిదాయకంగా ఉంటారని వివరించారు. వారు చూపిన మార్గంలోనే వెళ్తున్నామని అన్నారు. సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్యూబా సంఘీభావ సదస్సును నిర్వహించాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు స్టాలిన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన క్యూబా రాయబారి జుయెన్ కార్లోస్ మాట్లాడుతూ.. 1959 నుంచి భారత్‌తో క్యూబా సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఫైడల్ క్యాస్ట్రో పేద దేశాలు, పేదల ప్రజల గురించే నిత్యం ఆలోచిస్తారని అన్నారు. 1973, 1983లో క్యాస్ట్రో భారత్‌కు వచ్చారని గురు చేశారు. అలీన ఉద్యమంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. సోషలిస్టు దేశాల మధ్య ఐక్యత, కమ్యూనిస్టుల ఐక్య ఉద్యమాలతోనే సామ్రాజ్యవాదాన్ని ఓడించగలమని అన్నారు. క్యూబా మీద అమెరికా అనేక రకాలుగా ఆంక్షలను విధిస్తున్నదని చెప్పారు. ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు ముఖ్యంగా భారత్‌లో ఉన్న సిపిఎం, సిపిఐ ఎల్లప్పుడూ తమకు అండగా నిలబడ్డాయని వివరించారు. ఆగస్టు 13న క్యాస్ట్రో జయంతి వరకు క్యూబా సంఘీభావ కార్యక్రమాలను చేపడతామన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంఎ బేబీకి, శత వార్షికోత్సవాలను నిర్వహిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజాకు శుభాకాంక్షలు చెప్పారు. భారత్, క్యూబా మైత్రి బరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు.

క్యూబాకు అండగా నిలబడాలి : జాన్‌వెస్లీ

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడి పోరాడుతున్న సోషలిస్టు దేశం క్యూబాకు అండగా నిలబడాల్సిన అవసరముందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అమెరికా ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రభుత్వాలను కూల్చిందనీ, ఆర్థిక వ్యవస్థలను విధ్వంసం చేసిందని చెప్పారు. అమెరికాకు అనుకూలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసే కుట్రలను చేసిందన్నారు. క్యూబాను అస్థిరపరిచేందుకు కుట్రలు చేసిందని వివరించారు.

అమెరికా ఆంక్షలను తిప్పికొట్టాలి : వివస్ బోస్

క్యూబా ఉండాలి, నిలబడాలి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివస్ బోస్ అన్నారు. క్యూబాపై అమెరికా విధిస్తున్న ఆంక్షలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అమెరికా ఇప్పుడు ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభంలో ఉందన్నారు. ప్రజల దృష్టిని మరల్చడం కోసమే ట్రంప్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. క్యూబాపై ఆంక్షలను విధిస్తున్నారనీ, వివిధ దేశాలపై సుంకాలను పెంచుతున్నారని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు డిజి నరసింహారావు వేదికపైకి నాయకులను ఆహ్వానించారు.

క్యూబా సంఘీభావంగా విరాళాల సేకరణ

క్యూబాకు సంఘీభావంగా సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో విరాళాలను సేకరించాలని నిర్ణయించాయి. సదస్సుకు హాజరైన వారు విరాళంగా రూ.12,630 ఇచ్చారు. కొంత మంది పెన్షన్ ఇస్తామన్నారు. ఫైడల్ క్యాస్ట్రో జయంతి సందర్భంగా ఆగస్టు 13 వరకు విరాళాల సేకరణ ఉంటుందని ఆ పార్టీలు ప్రకటించాయి.

ఎన్‌డిఎస్‌ఎ నివేదికతో బిఆర్ఎస్ సిగ్గుపడాలి

- ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- క్యాబినెట్‌లో చర్చించి బాధ్యులపై చర్యలు
- మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ప్రాజెక్టుల భద్రతా సంస్థ(ఎన్‌డిఎస్ఎ) ఇచ్చిన నివేదికను చూసి బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పాలనలో కట్టిన ఈ ప్రాజెక్టు వారి పాలనలోనే కుప్పకూలిపోయిందని వ్యాఖ్యానించారు. దీంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎందుకూ పనికి రాకుండా పోయాయని గుర్తుచేశారు. ఆ నిర్మాణాలు డొల్ల అని ఎన్‌డిఎస్ఎ చెప్పినా, బిఆర్ఎస్ నేతలు మాత్రం తమ గొప్పతనమని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయమై ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదికపై మంత్రి హెచ్ఐసిసిలో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి బిఆర్ఎస్ ప్రభుత్వం అధిక వడ్డీలతో లక్ష కోట్లు ఋణం తీసుకొచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరిగాక కూడా బిఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. ఈ ప్రాజెక్టు బిఆర్ఎస్ సొంత జాగీర్ కాదన్నారు. విలువైన ప్రజాధనంతో కట్టిందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడితే చూస్తూ సహించేది లేదని హెచ్చరించారు. ఎన్‌డీఎస్ఎ ఇచ్చిన నివేదికపై సమగ్రమైన అధ్యయనం చేసిన మీదట తదుపరి చర్యల కోసం మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. బిఆర్ఎస్ పాలనలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించింది ఎంత మాత్రం కాదనీ, నాటి అధికార పార్టీ నేతలు జేబులు నింపుకోవడానికే దీనిని వినియోగించుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలను గుర్తించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదనీ, బాధ్యులైన వారికి శిక్షలు తప్పవని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన రూపకల్పన, నిర్వహణా లోపాలు బయట పడినందున బిఆర్ఎస్ నేతలు తెలంగాణ రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారెజ్‌లు నిరుపయోగంగా మారినా రాష్ట్రంలో ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలు మాత్రమే ఇందుకు దోహదపడ్డాయని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

రేవంత్‌కు పాలన చేతకాదు

- 2028 ఎన్నికల్లో బిజెపిని ప్రజలు పట్టించుకోరు
- తెలంగాణ ప్రజల గుండెచప్పుడు బిఆర్ఎస్
- మీడియా చిట్ చాట్‌లో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేత కావడం లేదు. సిఎం సర్కార్‌ను నడుపుతున్నారో... సర్కస్ కంపెనీ నడుపుతున్నారో అర్థం కావడం లేదు. అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయలేక ప్రజలను మోసం చేస్తున్నారు. బిజెపిని 2028 ఎన్నికల్లో ప్రజలు పట్టించుకోరు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే మాకు పోటీ. తెలంగాణ అస్థిత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక బిఆర్ఎస్. 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూసాం. ఓటమి నుంచి గెలుపు తీరాలను ఎలా చేరాలో మాకు తెలుసు. రేపు వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ వేడుకల్లో కెసిఆర్ ఇచ్చే సందేశం కోసం తెలంగాణ సమాజం ఎదురు చూస్తోంది" అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియా చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో పాలన గాడితప్పిందనీ, మంత్రులు, ఎమ్మెల్యేలు సిఎం మాట వినే పరిస్థితిలో లేరని కెటిఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందిచ్చిన హామీలను అమలు చేయలేక బిఆర్ఎస్‌పై నెపం నెట్టేందుకు కాంగ్రెస్ నేతలు నానా తంటాలు పడుతున్నారని ఆరోపించారు. "రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాంగ్రెస్ నేతలకు ఎన్నికల ముందు తెలియదా? కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా శ్రీధర్‌బాబు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా భట్టి, పిసిసి అధ్యక్షులుగా రేవంత్‌కు అన్ని విషయాలు తెలుసు. అయినా అడ్డగోలు హామీలిచ్చారు. వాటిని అమలు చేయలేక బిఆర్ఎస్‌పై నెపం నెట్టేందేందుకు కాంగ్రెస్ నేతలు నానా తంటాలు పడుతున్నారు. అప్పుల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు. పదేండ్లలో మేం సగటున ఏడాదికి రూ.41 వేల అప్పు చేస్తే, కాంగ్రెస్ ఏడాదిలో రూ.1,60,000 కోట్లు చేసింది" అని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నా రేవంత్‌రెడ్డి మాత్రం ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారని విమర్శించారు. అయన తన బాషను, పద్ధతిని మార్చుకోవాలని హితవు పలికారు. కెసిఆర్ అసెంబ్లీకి రావాలా వద్దా అనేది పార్టీ ఇష్టమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను విమర్శించడం మాని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని కెటిఆర్ ఆరోపించారు. అలాంటి వారు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

బిజెపికి మూడో స్థానమే

రాష్ట్రంలో బిజెపి మూడో స్థానానికే పరిమితమవుతుందని కెటిఆర్ అన్నారు. ఎంపి ఎన్నికల్లో నరేంద్ర మోడీ పేరు చెప్పి బిజెపి ఎనిమిది సీట్లు గెలుచుకుందని వ్యాఖ్యానించారు. ఎంపి ఎన్నికల్లో దేశభక్తి అంటూ ప్రజలను పక్కదారి పట్టించి గెలిచిందని విమర్శించారు. రానున్న 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తోనే పోటీ అని కెటిఆర్ స్పష్టం చేశారు.

పాకిస్తానీయులు దేశం విడిచిపోవాలి

- డిజిపి జితేందర్ ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల ఘటనల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న 208 మంది పాకిస్తానీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26 మంది అమాయక టూరిస్టులను ఉగ్రవాదులు హతమార్చిన నేపథ్యంలో పాకిస్తానీయుల వీసాలను వెంటనే రద్దు చేస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఉన్న పాకిస్తానీయుల సంఖ్యపై స్పెషల్ బ్రాంచ్‌తోపాటు ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు 208 మంది పాకిస్తానీయులు వివిధ వీసాలతో ఉన్నట్టు తెలిసింది. వారిలో సాధారణ వీసాతో వచ్చిన వారు ఈ నెల 27వ తేదీలోగా, వైద్యం కోసం వచ్చిన వారు 29వ తేదీలోగా వెళ్లిపోవాలని డిజిపి ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

తుక్కాపూర్‌ను సందర్శించిన బీహార్ సర్పంచులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపూర్ గ్రామపంచాయతీని శుక్రవారం బీహార్ రాష్ట్రానికి చెందిన 34 మంది సర్పంచులు ఎన్ఐఆర్‌డి ఆధ్వర్యంలో సందర్శించినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి తెలిపారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పరిశీలనలో భాగంగా గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, గ్రామ నర్సరీ, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, మహిళా సమభావన సంఘాల సమావేశాలు, గ్రామపంచాయతీ రిజిస్టర్, రికార్డ్స్ పరిశీలించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు పరుస్తున్న చేయూత పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, రైతు భరోసా, పల్లె దవాఖాన, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, మంచి నీటి సరఫరా తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించినట్టు వివరించారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బీహార్ సర్పంచులు ప్రశంసలు కురిపించినట్టు తెలిపారు.

విద్యార్థినుల ప్రయివేటు వీడియోలు తీసిన వార్డెన్..!

- బాయ్స్ హాస్టల్ వార్డెన్‌కు పంపుతున్న వైనం
- విబిఐటి కళాశాలలో దారుణ ఘటన
- ఆందోళనకు దిగిన విద్యార్థులు
- ఆ ఇద్దరినీ విధుల నుంచి తొలగిస్తున్నట్టు యాజమాన్యం ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విబిఐటి కళాశాలలో దారుణ ఘటన వెలుగుజూసింది. ఒక మహిళ అయి ఉండి.. అందునా హాస్టల్ వార్డెన్‌గా విద్యార్థినులకు రక్షణగా.. కంటికి రెప్పలా కాపాడాల్సింది పోయి వారి ప్రయివేటు వీడియోలు, ఫొటోలు తీసి బాయ్స్ హాస్టల్ వార్డెన్‌కు పంపింది. ఈ విషయాన్ని పసిగట్టిన విద్యార్థినులు ఆమె ఫోన్ లాక్కుని చూసి వాటిని గుర్తించి శుక్రవారం ఆందోళనకు దిగారు. ఘట్‌కేసర్ పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అవుషాపూర్ శివారులోని విబిఐటి కళాశాలలో లేడీస్ హాస్టల్ వార్డెన్‌గా రూప విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఆమె విద్యార్థినుల ప్రయివేటు ఫొటోలు, వీడియోలు తీసి ఇతరులకు పంపిస్తున్నట్టు కొందరు విద్యార్థినులకు అనుమానమొచ్చింది. దాంతో శుక్రవారం విద్యార్థినులు ఆమె ఫోన్ లాక్కుని చూడగా అందులో వీడియోలు, ఫొటోలు కనిపించాయి. వాటిని బాయ్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్ సత్యనారాయణకు పంపించినట్టు గుర్తించి ఆందోళనకు దిగారు. విద్యార్థులు తరగతులు బహిష్కరించి కళాశాల గేటు వద్దకు వచ్చి వార్డెన్ రూప, చీఫ్ వార్డెన్ సత్యనారాయణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే వారిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న ఘట్‌కేసర్ పోలీసులు అక్కడకు వెళ్లి విద్యార్థులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. వార్డెన్, చీఫ్ వార్డెన్‌ను సస్పెండ్ చేసేవరకు ఊరుకునే ప్రసక్తే లేదని విద్యార్థులు తేల్చి చెప్పారు. విషయాన్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, ఆ ఇద్దరు ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రకటించింది. దాంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

వ్యవసాయంలో కృత్రిమ మేథ వినియోగం

బిట్స్ పిలానీ-వ్యవసాయ విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వ్యవసాయంలో కృత్రిమ మేథ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని అగ్రి హబ్‌లో జరిగిన ఈ కార్యక్రమం వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, బిట్స్ పిలానీ విసి ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావు సమక్షంలో అవగాహన ఒప్పందం పత్రాలపై ఇరుసంస్థల అధికారులు సంతకాలు చేశారు. పరస్పరం ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నారు. ఈ సందర్భంగా బిట్స్ పిలానీ వీసీ రాంగోపాల్‌రావు మాట్లాడుతూ.. ఈ రెండు ప్రతిష్టాత్మకమైన సంస్థల మధ్య జరిగిన ఈ అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పిహెచ్‌డి విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందనిఅన్నారు. ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి నాణ్యమైన పరిశోధనా పత్రాలు ప్రచురించడానికి కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. దుబాయ్‌తోపాటు దేశంలోని నాలుగు చోట్ల బిట్స్ క్యాంపస్‌లు ఉన్నాయని, అందులో ప్రతి ఏటా సుమారు 600 మంది పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందుతున్నారన్నారు. దేశంలోనే మూడవ అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టార్టప్ నెట్‌వర్క్ బిట్స్ పిలానీ సంస్థకు ఉందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని వివరించారు. యూనివర్సిటీ విసి ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండోదని, ఇది అమెరికా ల్యాండ్ గ్రాంట్ మోడల్‌లో ఏర్పాటయిందని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, బిట్స్ పిలానీ డీన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ సంకేత్ గోయల్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాల అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డాక్టర్ రాములు, డిజిటల్ అగ్రికల్చర్ సంచాలకులు డాక్టర్ బాలాజీ నాయక్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బిట్స్ పిలానీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాల రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

- కన్వీనర్‌గా మంగ నర్సింహులు
- కోకన్వీనర్‌గా పెసరకాయల జంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పాల రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో జరిగింది. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మంగ నర్సింహులు (యాదాద్రి భువనగిరి జిల్లా), కోకన్వీనర్‌గా పెసరకాయల జంగారెడ్డి (రంగారెడ్డి జిల్లా) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా జి.కృష్ణారెడ్డి (నాగర్ కర్నూల్), ఎం.పరమేశ్వర చారి (వనపర్తి), సిహెచ్ తిరుపతిరెడ్డి (సిద్దిపేట), కాటిరాల తిరుపతిరావు (కొత్తగూడెం జిల్లా), పుచ్చకాయల కృష్ణారెడ్డి (వరంగల్), బొబ్బిలి సుధాకర్ రెడ్డి (నల్లగొండ), బి.మధుసూదన్‌రెడ్డి (రంగారెడ్డి), బి.మహేందర్‌రెడ్డి (రంగారెడ్డి), సంధిల్ల భాస్కర్ (యాదాద్రి భువనగిరి), ఏదునూరి మల్లేష్ (యాదాద్రి భువనగిరి), వాసిరెడ్డి ప్రసాద్ (ఖమ్మం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాల రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగ నరసింహులు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడి రైతులను ఐక్యం చేస్తూ, సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామన్నారు. ప్రభుత్వ మ్యాక్స్ పరిధిలోని డెయిరీల బలోపేతం కోసం, ఆస్తుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని చెప్పారు.

NOTICE

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: AVANIGADDA, KRISHNA DIST., ANDHRA PRADESH

I.A. No.542/2023 in O.S.No. 7 / 2016

Between :
Vishnubotla Rajeswari &Others ..Petitioners/Plaintiffs
And
Jammalamadaka Chandra Sekhar & Others ....Respondents/Defendants

To,
R-2: Jammalamadaka Sujatha, D/o. Late Siva Rama Krishna Murthy, R/o.Flat No.502, Legend Venkatesha beside Taj Mahal Hotel, Narayanaguda, Hyderabad-500029.
R-10: Jammalamadaka Vishnavi, D/o. Late Siva Ram R/o.Flat No.339, Janapriya Arcadia Phase-II, A-Block, Kowkur, Hyderabad- 500010.

పై నెంబరు దావాలోని ఐ.ఏ. 542/2023లో 2&10వ రెస్పాండెంట్లు/ప్రతివాదులకు శ్రీ కోర్టువారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టుద్వారా నోటీసులు పంపిననూ తీసికొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరుప్రకటన ద్వారా నోటీసు జారీ నిమిత్తం **ది.09-05-2025**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పైకోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేనిచో సదరు పిటీషను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : **09-05-2025**

యస్. ఏడుకొండలు, బి. బాజి,
పిటీషనర్లు/వాదులు తరపు అడ్వకేట్స్, శివసాయి సదన్ అపార్ట్‌మెంటు, 5వ లైను, నగరంపాలెం, గుంటూరు-522004, సెల్: 9849373199

'అంగన్‌వాడీ'లకు ఎండదెబ్బ

- చిన్నపిల్లలు వచ్చే కేంద్రాలకు వేసవి సెలవులు కరువు
- పౌష్టికాహారం తీసుకునేందుకు అవస్థలు
- అద్దె భవనాలే ఎక్కువ.. అందులోనూ అరకొర వసతులే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే సూరీడు సుర్రుమంటూ తన ప్రతాపం చూపుతున్నాడు. ఏప్రిల్ చివరి వారంలోనే రాష్ట్రమంతటా సరాసరి 45డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదువుతుండగా.. ఇప్పటికే సగానికిపైగా జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో విద్యా సంస్థలన్నింటికీ వేసవి సెలవులు ప్రకటించిన ప్రభుత్వం.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వచ్చే అంగన్‌వాడీలకు సెలవులు లేవు. మండుటెండలో ఆయా కేంద్రాలకు వచ్చేందుకు వారంతా జంకుతుండగా.. వచ్చిన వారంతా కనీస సౌకర్యాలు లేక ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇచ్చి.. పౌష్టికాహారం ఇండ్లకే సరఫరా చేసే అవకాశం కల్పించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో మొత్తం 149 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉండగా.. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 99, పట్టణ ప్రాంతాల్లో 25, గిరిజన ప్రాంతాల్లో 25 ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 31,711 ప్రధాన, 3,989 మినీ కేంద్రాలు కలుపుకుని మొత్తం 35,700 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఈ కేంద్రాలకు ప్రతిరోజూ గర్భిణులు, తల్లులు 4,57,643 మంది వస్తుండగా.. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 10,34,562 మంది వస్తున్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 6,67,783 మంది వస్తున్నారు.

కరీంనగర్ జిల్లా వరకు పరిశీలిస్తే.. మొత్తం 777 కేంద్రాల్లో 9650 మంది చిన్నారులు, గర్భిణులు 3620, బాలింతలు నాలుగు వేల మంది వస్తున్నారు. జిల్లాలో 307 కేంద్రాలకే సొంత భవనాలు ఉండగా.. 221 కేంద్రాలు అద్దె భవనాల్లో, 119 కేంద్రాలు ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో విద్యుత్ సరఫరా లేని కేంద్రాలు 125 వరకు ఉండగా, విద్యుత్తు ఉన్న ఫ్యాన్లు లేని కేంద్రాలు 100 వరకు ఉన్నట్టు అంగన్‌వాడీల ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 23,385 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 12,315 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

కనీస సౌకర్యాల్లేక అవస్థలు

సొంత భవనాలు ఉన్న చాలా కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్ లేదు. విద్యుత్ కనెక్షన్ ఉన్న చోట కనీసం ఫ్యాన్లు కూడా లేవు. దీంతో చిన్నారులు, టీచర్లు, ఆయాలతోపాటు 'ఆరోగ్య లక్ష్మి' కింద భోజనం చేయడానికి వచ్చే గర్భిణులు, తల్లులు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు ఎండ భయానికి చాలా మంది తల్లిదండ్రులు పిల్లల్ని కేంద్రాలకు పంపడానికి ఇష్టపడటం లేదు. గర్భిణులు ఎండలోనే కేంద్రానికి వెళ్లి భోజనం చేయాలంటే జంకుతున్నారు. ఒకవేళ టీచర్ సెలవులో ఉంటే 'ఆయా' పిల్లల ఆలనా, పాలనా చూడటంతోపాటు వంట చేసి భోజనం పెట్టాలి. ఆయా సెలవులో ఉంటే టీచరే వంట చేయాలి. పిల్లల్ని చూసుకోవాలి. ఈ పరిస్థితుల్లో పని భారం కూడా ఎక్కువై సిబ్బంది అల్లాడిపోతున్నారు.

ఇంటికి అందిస్తే మేలు

ఎండలు తగ్గేవరకూ పిల్లలు, తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని ఇంటికే సరఫరా చేయడం సబబుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎండలు తగ్గే వరకు కనీసం నెల రోజులపాటు పౌష్టిహారాన్ని ముందుగానే అందించాల్సిన అవసరం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉక్కపోతతో, తరువాత ఇంటికి ఎండలోనే వెళ్లాల్సి ఉన్నందున ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఇంటికే పౌష్టిహారం ఇచ్చే వెసులుబాటు ఇవ్వాలి
పద్మశ్రీ, అంగన్‌వాడీ టీచర్, దుర్శేడ్

ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కేంద్రాలకు పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు కూడా వచ్చేందుకు జంకుతున్నారు. ఈ పరిస్థితుల్లో నెలకు సరిపడా పౌష్టికాహార సరుకులు వారి ఇండ్లకే వెళ్లి ఇచ్చేలా వెసులుబాటు కల్పించాలి.

వేసవి సెలవులు ఇవ్వాలి

ఆడపెల్లి మంగ, అంగన్‌వాడీ టీచర్, మారుతినగర్

స్కూల్, కాలేజీలకు వెళ్లే పెద్ద పిల్లలకు సెలవులు ఇస్తున్నారు. చిన్నపిల్లలు వచ్చే అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వరా? ఎండ తీవ్రతకు కేంద్రాలకు పిల్లలు పంపడం లేదు. వేసవి కాలంలో వారి ఇండ్లకే పౌష్టికాహారం ఇచ్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలి.

అవసరమైన చర్యలకు ప్రతిపాదనలు పంపాం..
సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి, కరీంనగర్

తల్లులకు, గర్భిణులకు, పిల్లలకు 365 రోజులు పౌష్టికాహారం ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయి. జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న క్రమంలో, కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి మే 1 నుంచి 15 రోజులు టీచర్‌కి, మరో 15రోజులు ఆయా విధులు నిర్వహించేలా ఉత్తర్వులు వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కేంద్రాలను నడిపిస్తున్నాం. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉదయం పూట ఆటపాటలతో చదువు చెప్పి భోజనం పెట్టిన అనంతరం ఇంటికి పంపించేలా చూస్తున్నాం.

గ్రామపంచాయతీ పాలన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

గ్రామపంచాయతీ పాలన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైల్వే రిటైర్డ్ అధికారి కెవి రావు రచించిన గ్రామపంచాయతీ పాలనా పుస్తకాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) హైదరాబాద్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. భారతదేశంలో పంచాయతీరాజ్ చరిత్ర మొదలుకొని తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, గ్రామ సభలు, సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలు, అర్హతలు, సర్పంచ్, సెక్రటరీ నిధులు-విధులు, గ్రామపంచాయతీలో పన్నులు నిధుల వినియోగం, గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్, గ్రామ ప్రగతి ప్రణాళికలు.. ఇలా సమగ్ర విషయాలను క్రోడీకరించి పుస్తకాన్ని రూపొందించిన రచయిత కేవీ రావును మంత్రి సీతక్క అభినందించారు. గ్రామపంచాయతీ పాలనపై అవగాహన పెంచుకునేందుకు ఈ పుస్తకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ స్థానిక ఎన్నికలకు తెలంగాణ సమాయత్తమవుతున్న సమయంలో ఇలాంటి పుస్తకం రావడం ఉపయోగకరమన్నారు.

తెలంగాణలో అశోక్‌లేలాండ్ డీలర్‌షిప్ విస్తరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ వాణిజ్య వాహనాల తయారీ కంపెనీ అశోక్ లేలాండ్ తన రిటైల్ నెట్‌వర్క్‌ను తెలంగాణలో మరింత విస్తరించినట్లు ప్రకటించింది. శుక్రవారం నిజామాబాద్‌లో కొత్త లైట్ కమర్షియల్ వెహికల్ (ఎల్‌సివి) డీలర్‌షిప్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇది తెలంగాణ రాష్ట్రంలో నాల్గవ డీలర్‌షిప్ అని అశోక్ లేలాండ్ ఎల్‌సివి బిజినెస్ హెడ్ విప్లవ్ షా తెలిపారు. తెలంగాణ తమకు కీలకమైన మార్కెట్ అని తమ ఉనికిని మరింత బలోపేతం చేయడానికి ఉత్సాహంగా ఉన్నామన్నారు.

నల్లగొండ జైలులో నిర్వహణ భేష్

- నిబంధనల ప్రకారం ఖైదీలకు సౌకర్యాలు
- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా జైలులో నిబంధనల ప్రకారం ఖైదీలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ తెలిపారు. ముఖ్యంగా భోజనం, ఇతర సౌకర్యాలు, వంట గది నిర్వహణ బాగుందని, జైలులో ఎలాంటి ఇబ్బందులూ లేవని చెప్పారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని జైలును సందర్శించారు. జైలులోని అన్ని బ్యారక్స్‌ను, వంట గదిని, ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలను, భోజనాన్ని పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జైలు బయట మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలని తెలిపారు. జైలులో సౌకర్యాలన్నింటినీ పరిశీలించామన్నారు. అధికారుల ప్రవర్తన, సౌకర్యాలు, తదితర వివరాల గురించి ఖైదీలతో మాట్లాడి తెలుసుకున్నామన్నారు. జిల్లా జైలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా, నిబంధనల ప్రకారం ఖైదీలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారని చెప్పారు. ఖైదీల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ లేవని తెలిపారు. ఖైదీలలో కొంతమంది నైపుణ్యం కలిగిన వారు ఉన్నారని తెలిపారు. ఖైదీల వివరాలు, సౌకర్యాలు, ఏర్పాట్లు తదితర వివరాలను జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ తెలియజేశారు. ఆయన వెంట జిల్లా జైలర్ బాలకృష్ణ ఉన్నారు. అంతకుముందు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద ఆయనకు నల్లగొండ ఆర్‌డిఒ వై అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి రమేష్, డిఎస్‌పి శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

ధాన్యం కొనుగోలుపై ఆరా..

జిల్లాలో ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న సేవలు, సంక్షేమ హాస్టళ్ల గురించి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ ఉద్యమానికి- సిద్దిపేటకు పేగుబంధం

- మాజీమంత్రి హరీశ్‌రావు
- వరంగల్ సభకు విద్యార్థి, యువత ఆధ్వర్యంలో పాదయాత్ర
- సిద్దిపేటలో జెండా ఊపి ప్రారంభం..

కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమానికి.. సిద్దిపేటకు పేగు బంధం ఉందని.. ఆనాటి కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బిఆర్ఎస్ పార్టీ ప్రారంభమైనా సిద్దిపేటతో సంబంధం ఉందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వేయిమంది విద్యార్థి, యువత పాదయాత్రను అమరవీరులకు నివాళ్లర్పించి, జెండా ఊపి ఆయన ప్రారంభించారు.

ముందుగా కాశ్మీర్ పెహల్గమ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి గటించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట నుంచి పాదయాత్రగా బయలుదేరిన విద్యార్థి, యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బిఆర్ఎస్ కార్యకర్తలందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నానన్నారు. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలని అన్నారు. ఈ పాదయాత్ర రేపటి బిఆర్ఎస్ అధికారంలోకి రావడానికి విజయయాత్ర కాబోతున్నదని తెలిపారు. 14 ఏళ్ల ఉద్యమం, పదేళ్ల ప్రభుత్వం ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం, ఏ పాత్ర అయినా బిఆర్ఎస్ తెలంగాణ పక్షం అని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చిందని, అవన్నీ మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలని ప్రజలకు అర్థమయిందని తెలిపారు. లంకలో రావణుడు చేసే అరాచకాలను ఎదిరించడానికి రామదండు కదిలిందని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందన్నారు. పాదయాత్ర విజయవంతం చేయడానికి అందరూ క్రమశిక్షణతో ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడారం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఇంజనీర్ సురేష్

శాశ్వత పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

- మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ సురేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతరైన మేడారంలో వచ్చే సంవత్సరం-2026 మహా జాతర జరగనున్న నేపథ్యంలో సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా శాశ్వత పనుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ కె సురేష్ అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశానుసారం ఆయన శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ములుగు జిల్లా మేడారం పరిసర ప్రాంతాలైన చింతల్ క్రాస్ రోడ్డు, కాల్వపల్లి క్రాస్ రోడ్డు, కన్నెపల్లి, చిలుకల గుట్ట, బ్రిడ్జి సమీపంలో, ఆర్టీసీ ఏరియా, శివరాం సాగర్ ప్రాంతాల్లో పర్యటించారు. మేడారం పరిసరాల్లో తాగునీటి సౌకర్యార్థం వాటర్ ట్యాంకుల నిర్మాణంతోపాటు, భక్తుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ ప్రణాళికలను త్వరలోనే ప్రభుత్వానికి నివేదించినట్టు చెప్పారు. మేడారం మహా జాతరకు వచ్చే ప్రజలకు జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. వచ్చే మేడారం మహా జాతరకు జాతర పరిసర ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేనివిధంగా సకల సౌకర్యాలను కల్పించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లేష్, ఇఇలు మాణిక్యరావు, రామాంజనేయులు, సుభాష్, డిఇలు సునీత, వెంకట సతీష్, జీవన్ ప్రకాష్, శ్రీనివాస్, మధుకర్, ఎఇలు నవీన్, ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి విజయం

- 38 ఓట్ల మెజార్టీ..
- బిజెపి అభ్యర్థికి 25 ఓట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి విజయం సాధించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం ఎనమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా, పది గంటల్లోపు ముగిసింది. ఎంఐఎం అభ్యర్థికి 63 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి గౌతమ్ రావుకు 25 ఓట్లు వచ్చాయి. 38 ఓట్ల మెజార్టీతో ఎంఐఎం అభ్యర్థి గెలుపొందారు. క్రాస్ ఓటింగ్ ఆశలు పెట్టుకున్న బిజెపికి నిరాశే ఎదురైంది.

తమకున్న 25 ఓట్లు మాత్రమే బిజెపికి పోలయ్యాయి. ఎంఐఎంకు చెందిన 49, కాంగ్రెస్‌కు చెందిన 14 ఓట్లు కలిపి మొత్తం 63 ఓట్లు ఎంఐఎం అభ్యర్థికి పోలయ్యాయి. దాంతో ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ గెలుపొందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాన్ని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఈ నెల 23న జరిగిన ఎన్నికల్లో 112 ఓట్లకుగాను 88 ఓట్లు పోలయ్యాయి. 66 మంది కార్పొరేటర్లు, 22 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌లో బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొన్నారు. ఓటింగ్‌కు బిఆర్ఎస్ కార్పొరేటర్లు, కొందరు ఎక్స్ ఆఫీషియో సభ్యులు దూరంగా ఉన్నారు.

డిక్లరేషన్ సర్టిఫికెట్‌ను అందించిన రిటర్నింగ్ అధికారి

పరిశీలకుల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ఎన్నికల నియమావళికి అనుగుణంగా పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగం, మీడియాకు రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

ఏకగ్రీవం కావొద్దనే బిజెపి పోటీ చేసింది : మీర్జా రియాజ్

ఎంఐఎంకు ఎమ్మెల్సీ స్థానం ఏకగ్రీవం కావద్దనే ఉద్దేశంతోనే చివరి నిమిషంలో బిజెపి తన అభ్యర్థిని ఎన్నిక బరిలో నిలిపిందని రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి అన్నారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన తమ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసికి కృతజ్ఞతలు చెప్పారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దుశ్చర్య కారణంగా విజయోత్సవ ర్యాలీని రద్దు చేసుకున్నామని తెలిపారు. తమ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ జరుపుతామని చెప్పారు.

ఆ మూడు పార్టీలు ఒక్కటే : బిజెపి అభ్యర్థి గౌతమ్

తమ కార్పొరేటర్లను ఓటు వేయకుండా అడ్డుకున్న బిఆర్ఎస్ పార్టీ గుర్తింపును ఎన్నికల కమిషన్ ఎందుకు రద్దు చేయొద్దని బిజెపి అభ్యర్థి గౌతమ్‌రావు ప్రశ్నించారు. బిఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కెటిఆర్ ఓట్లు వేయొద్దు అని చెప్పారని, ఈ పార్టీ ఇప్పుడు ఏ విధంగా ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. ఈ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, ఎంఐఎం, బిఆర్ఎస్ ఒక్కటే అనేది అర్థమైందన్నారు.

నానక్‌రామ్ గూడలో స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

దంత వైద్య సేవలందిస్తోన్న స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ తన మూడో బ్రాంచ్‌ను నానక్ రామ్ గూడలో ఏర్పాటు చేసింది. దీనిని శుక్రవారం ఆ సంస్థ సిఎండి డాక్టర్ రామకృష్ణ లాంచనంగా ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా దంత వైద్య రంగంలో సరికొత్త ప్రమాణాలు పాటిస్తూ ఉన్నామన్నారు. అత్యాధునిక సదుపాయాలతో పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ఇప్పటికే సేవలందిస్తున్నామని చెప్పారు. ఆధునిక వైద్య పద్ధతులపై ఎంతో నిబద్ధతతో ఉన్నామన్నారు. తమ గ్రూప్‌లోని మూడు హాస్పిటల్స్‌లో 50 పైగా ఆధునిక దంత చెయిర్స్ ఉన్నాయన్నారు. అత్యంత అనుభవం గల 40 మంది నిపుణులు ప్రతి రోజూ 200 పైగా రోగులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు.

జడ్సన్ వర్సిటీలో స్పాట్ ప్రవేశాలు

- హైదరాబాద్ కెరీర్ ఎడ్యూ గ్రూప్ వెల్లడి

హైదరాబాద్ : యునైటెడ్ స్టేట్స్‌లో చదువుకోవాలనుకునే విద్యార్థుల కోసం అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోన్నట్లు అంతర్జాతీయ ఎడ్యుకేషన్ కన్సల్టింగ్ సంస్థ కెరీర్ ఎడ్యు గ్రూప్ (సిఇజి) తెలిపింది. అమెరికాకు చెందిన జడ్సన్ యూనివర్సిటీతో అనుసంధానమై స్పాట్ అడ్మిషన్స్ కోసం ఏప్రిల్ 26న హిమాయత్‌నగర్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తోన్నట్లు ఆ సంస్థ ప్రతినిధి నిక్కి ఫెన్నెమ్ తెలిపారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని కెరీర్ వింగ్స్ కన్సల్టెంట్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిక్కి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా తాము బి2బి ఎడ్యుకేషనల్ ఏజెంట్స్, విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గ్లోబర్ కెరీర్ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు.

ఇంటర్ ద్వితీయ భాషగా సంస్కృతం ప్రవేశపెట్టడం లేదు

- ఇంటర్ ఆర్‌జెడి జయప్రదబాయి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ద్వితీయ భాష తెలుగుకు సముచిత స్థానం ఉండాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సియు) అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) జయప్రద బాయిని శుక్రవారం హైదరాబాద్‌లో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగుకు ప్రత్యామ్నాయంగా సంస్కృతం సబ్జెక్టును ప్రవేశపెడుతున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తవమని ఆమె తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

- విదేశీ ప్రతినిధులతో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ సమ్మిట్‌లో ప్రధానంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలంటూ విదేశీ ప్రతినిధులను కోరినట్టు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో అహింస, సత్యం, సామాజిక న్యాయం ఎజెండాగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మౌలిక సిద్ధాంతాలను అంగీకరించే ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల వాదులు హాజరైనట్టు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైన భారత్ సమ్మిట్ మొదటి రోజు పూర్తయిన సందర్భంగా భారత్ సమ్మిట్ కో ఆర్డినేటర్ సల్మాన్ ఖుర్షీద్, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నెరెళ్ల శారద, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ నేత మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. భారత్ సమ్మిట్ ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ...కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ భావజాలాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కలిగి ఉందని తెలిపారు. ఉగ్రదాడికి నిరసనగా సంతాపం తెలిపే కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములవుతామని విదేశీ ప్రతినిధులు ఆసక్తి చూపించినట్టు భట్టి వెల్లడించారు. ఎఐసిసి సభ్యులు సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక న్యాయం దేశానికే ఆదర్శమని ప్రశంసించారు. రాహుల్ గాంధీ అందరికి సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నారని తెలిపారు. దానిని సాధించేందుకు అవసరమైన డాటా, విశ్లేషణ అవసరమనీ, ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం అభినందనీయమని చెప్పారు. జెండర్ సమానత్వం-మహిళా భవిష్యత్తు, తప్పుడు సమాచారానికి, వాస్తవాలకు మధ్య జరుగుతన్న పోరాటం, యువత, భవిష్యత్తు రాజకీయాలు, మారుతున్న పరిస్థితులు అనే అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్ సమ్మిట్ 2025లో భాగంగా నేడు జరగాల్సిన పలు కార్యక్రమాలు శనివారానికి వాయిదా వేశారు. తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలతో విదేశీ ప్రతినిధులకు ఘనంగా ఆహ్వానం పలుకేందుకు రూపొదించుకున్న కార్యక్రమాలన్నీ రద్దు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి చేయాల్సిన హైదరాబాద్ డిక్లరేషన్ సైతం వాయిదా పడింది. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంపి ప్రియాంకగాంధీ దూరంగా ఉన్నారు. పహల్గాం దాడుల నేపథ్యంలో వారు దూరంగా ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

'గిగ్' బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- ప్రతిపాదిత యాక్టులో మార్పులు చేయాలి : పాలడుగు భాస్కర్
- కార్మిక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 12న ప్రజల కోసం విడుదల చేసిన "తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్ -2025"లో ప్రభుత్వం ప్రతిపాదించిన వాటిల్లో అనేక మార్పులు చేయాలనీ, వెల్ఫేర్ బోర్డులో కార్మిక సంఘాలకు కూడా స్థానం కల్పించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. బోర్డు మీటింగ్ మూడు నెలలకోసారి జరపాలనీ, సమావేశానికి ముందే సభ్యులు ప్రతిపాదించే అంశాలను ఎజెండాలో చేర్చి చర్చించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్‌కు పలు అంశాలపై లేఖ అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, ఉపాధ్యక్షులు విఎస్ రావు, కోశాధికారి వంగూరు రాములు పాల్గొన్నారు. కోటిమందికిపైగా ప్రయోజనం చేకూరే "తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు"లో కార్మిక సంఘాల ప్రతినిధులకు కూడా చోటు కల్పించాలని కోరారు. బోర్డు కాలపరిమితి మూడేళ్లకు కాకుండా రెండేండ్లకు కుదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మూడు నెలలకోసారి బోర్డు సమావేశమయ్యేలా చట్టంలో పొందుపర్చాలని సూచించారు. "మెజారిటీ ఆఫ్ ఓట్స్" ప్రాతిపదికన నిర్ణయం అనేది సరిగాదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బోర్డులో ప్రభుత్వ, యాజమాన్య ప్రతినిధులు, గిగ్ వర్కర్స్, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఇతరులు కూడా సమాన ప్రాతిపదికన ఉండేలా చూడాలని విన్నవించారు. సామాజిక భద్రత పథకాలు ఏమిటనే దానిపై స్పష్టతివ్వాలని కోరారు. ప్రతిపాదిత చట్టంలోని సెక్షన్-19 సబ్‌సెక్షన్(1)లో ప్రతిపాదించిన వెల్ఫేర్ ఫండ్ ఫీజును 1 శాతం, 2 శాతం కాకుండా 3 శాతానికి తగ్గకుండా అగ్రిగేటర్ల నుంచి వసూలు చేయాలని ప్రతిపాదించారు. సబ్ సెక్షన్ (2)లో ప్రతిపాదించేది కూడా సవరించి షెడ్యూల్-1లోని అగ్రిగేటర్ల నుండి కూడా ఎంత వెల్ఫేర్ ఫండ్ ఫీజ్‌ను వసూలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఆఫీసర్ ఇచ్చిన ఉత్తర్వులపై 90 రోజుల కాలపరిమితితో అప్పీల్ చేసుకోవాలని ప్రతిపాదించారని, అదే సమయంలో ఎంత కాలంలో పరిష్కరించాలనే దానిపై స్పష్టత ఇవ్వలేదని ఎత్తిచూపారు. ప్రతిపాదిత చట్టంలోని సెక్షన్-23లోని సబ్ సెక్షన్ (1)లో 100 మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ పనిచేసే చోట మాత్రమే "ఇంటర్నల్ డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీ"ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించటం సరిగాదన్నారు. అనేక చట్టాలు 10/20 మంది కార్మికులు ఉన్న చోట అమలవుతున్న నేపథ్యంలో ఆ సంఖ్యను పదికి మార్చాలని కోరారు. ఇటీవల కాలంలో గిగ్ / ప్లాట్‌ఫామ్ కార్మికులపై కస్టమర్లు దాడి చేయటం, అవమానాలకు గురిచేయడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రస్తావించారు. ఆ రంగంలో మహిళా కార్మికులు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో వారికి సరైన రక్షణ కల్పించే విషయాన్ని చట్టంలో పొందుపర్చాలని కోరారు. వేతన సవరణ చేసే క్రమంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను కూడా భాగస్వామ్యం చేయాలని విన్నవించారు. తమ సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదిత చట్టంలో పొందుపర్చాలని విజ్ఞప్తి చేశారు.

బాలానగర్‌లో మహేష్ బ్యాంక్ కొత్త ఎటిఎం ప్రారంభం

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ తన బాలానగర్ శాఖలో అప్‌గ్రేడెడ్ ఎటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీనిని ఆ బ్యాంక్ డైరెక్టర్ రామ్‌ప్రకాష్ భండారి, రామ్ నారాయణ బోగ లాంచనంగా ప్రారంభించారు. ఖాతాదారులు అందిస్తున్న మన్ననలకు రామ్‌ప్రకాష్ ధన్యవాదాలు తెలిపారు. తమ శాఖల్లో త్వరలో ట్రేడర్స్ మీట్‌ను నిర్వహించనున్నామని రామ్ నారాయణ అన్నారు. దీంతో వారి రుణ అవసరాలను తీర్చనున్నామని పేర్కొన్నారు.